క్లుప్తంగా

ఎస్.ఎం.పురంలో ఫ్లాగ్ మార్చ్



ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

ఎచ్చెర్ల క్యాంపస్: మే 13వ తేదీన నిర్వహించనున్న సార్వత్రిక ఎన్నికల్లో స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని జేఆర్ పురం సీఐ జి.రామచంద్రరావు పిలుపునిచ్చారు. కేంద్ర బలగాల ఆధ్వర్యంలో ఎస్.ఎం.పురం గ్రామంలో సోమవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు ఓటు హక్కు, ప్రజాస్వామ్యంపై అవగాహన కల్పించారు. ఎస్సై చిరంజీవి పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం



బోరు బాగుచేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: మండలంలోని ముద్దాడ పంచాయతీ పరిధి రుప్పపేట గ్రామంలో మరమ్మతులకు గురైన తాగునీటి బోరును స్థానిక సర్పంచ్ ముద్దాడ శంకర్ ఆధ్వర్యంలో సోమవారం బాగుచేసి వినియోగంలోకి తీసుకువచ్చారు. ఇక్కడ బోరు మరమ్మతులకు గురికావడంతో స్థానికులు తాగునీటికి ఇబ్బంది పడ్డారు. బోరును వినియోగంలోకి తీసుకురావడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులకు సేవాదృక్పథం అవసరం



మాట్లాడుతున్న కేవీజీడీ బాలాజీ

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులకు సేవా దృక్పథం అవసరమని శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ఎస్ఎంపురం క్యాంపస్ డైరెక్టర్ కొక్కిరాల వెంకట గోపాల ధన బాలాజీ అన్నారు. ఎస్ఎంపురం గ్రామంలో సోమవారం ఆర్‌జీయూకేటీ జాతీయ సేవా పథం యూనిట్-1, 4 ఆధ్వర్యంలో వారం రోజులు నిర్వహించనున్న ప్రత్యేక శిబిరాన్ని ప్రారంభించారు. విద్యార్థులు ప్రజలకు సేవ చేయాలని, సేవా కార్యక్రమాలు, చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఓఎస్‌డీ ఎల్.సుధాకర్‌బాబు, ఏఓ ముని రామకృష్ణ, డీన్ మోహన్‌కృష్ణ చౌదిరి, పీఓలు గణపతి రావు, శ్రీధర్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



అవగాహన కల్పిస్తున్న సీతామహాలక్ష్మి

శ్రీకాకుళం అర్బన్: చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని ఐసీడీఎస్ శ్రీకాకుళం అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని కృష్ణాపార్కు సెక్టారు సూపర్‌వైజర్ పి.సీతామహాలక్ష్మి అన్నారు. పోషణ-పఖ్వాడ కార్యక్రమంలో భాగంగా సోమవారం శ్రీకాకుళం నగరంలోని మహిళా మండలివీధి అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార విలువలతో కూడిన ఆహార పదార్థాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోషకాహార విలువలతో కూడిన ఆహారం తీసుకుంటే రక్తహీనత బారిన పడకుండా ఉంటారన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సునీత, సుజాత, నాగమణి ఉన్నారు.

ఎన్నికల నియమావళి పక్కాగా అమలు చేయాలి



మాట్లాడుతున్న మండల ఎన్నికల రిట్నరింగ్ అధికారి ఉమామహేశ్వరరావు

జి.సిగడాం: ఎన్నికల నియమావళిని పక్కాగా అమలు చేయాలని మండల ఎన్నికల రిట్నరింగ్ అధికారి ఆర్.ఉమామహేశ్వరరావు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన వివిధ శాఖల సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మే 13వ తేదీన జరగనున్న ఎన్నికల సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో పార్టీ జెండాలు ఉంటే తక్షణమే తొలగించాలన్నారు. కేంద్రాలకు వెళ్లే సౌకర్యాలను పరిశీలించాలన్నారు. ఎన్నికల ప్రక్రియను పూర్తిచేసేందుకు అందరి సహాయం తీసుకుంటున్నామన్నారు. గ్రామస్థాయి సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించాలన్నారు. డీటీలు నిర్మల, గాయిత్రి, ఆర్ఐ రామచంద్రరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా పది పరీక్షలు ప్రారంభం



రణస్థలం: కేజీబీవీ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ప్రిన్సిపాల్ హైమావతి

రణస్థలం: మండలంలోని పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయని ఎంఈఓ త్రినాథరావు తెలిపారు. మండలంలోని పైడిభీమవరం, జే.ఆర్.పురం, ఆదర్శ పాఠశాలలో 1192 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు.

సజావుగా ..

ఎచ్చెర్ల క్యాంపస్: పది తరగతి పరీక్షలు సజావుగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు అర గంట ముందుగానే చేరుకున్నారు. ఎచ్చెర్ల మండలంలో ఐదు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఎచ్చెర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఎచ్చెర్ల కేశవరెడ్డి ప్రైవేట్ పాఠశాల, బొంతలకోడూరు ఉన్నత పాఠశాల, కుప్పిలి మోడల్ స్కూల్, ఎస్ఎంపురం ఏపీ గురుకుల పాఠశాలల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. 1336 మంది పరీక్ష రాస్తుండగా, బాలురు 725, బాలికలు 611 మంది ఉన్నారు. విద్యాశాఖ అధికారులు పరీక్షల నిర్వహణను పర్యవేక్షించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు.

జి.సిగడాం మండలంలో..

జి.సిగడాం: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలో మూడు పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. మౌలిక సదుపాయాలు కల్పించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు.

పదో తరగతి పరీక్ష కేంద్రాల తనిఖీ

శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళం నగరంలోని పదో తరగతి పరీక్షలు జరుగుతున్న పలు కేంద్రాలను జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక, అదనపు ఎస్పీ జి.ప్రేమ్‌కాజల్ సోమవారం తనిఖీ చేశారు. ఎటువంటి అవకతవకలు జరగకుండా, విద్యార్థులకు అంతరాయం కలుగకుండా ప్రశాంతంగా రాసేందుకు బందోబస్తు ఏర్పాట్లు చేశామని వారు తెలిపారు. పరీక్ష ముగిశాక ఎటువంటి ట్రాఫిక్ అంతరాయం కలగకుండా పోలీసులకు సూచనలందించామని ఎస్పీ చెప్పారు. నగరంలోని గీతాంజలి, భాష్యం స్కూళ్లను ఎస్పీ సందర్శించగా, ఆర్సీఎం లయోలో, బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలను అదనపు ఎస్పీ సందర్శించారు. వీరి వెంట సీఐలు సన్యాసినాయుడు, ఉమామహేశ్వర్రావు, ఎస్ఐ బలివాడ గణేష్ ఉన్నారు.



శ్రీకాకుళం అరసవల్లి రోడ్‌లో కేశవరెడ్డి స్కూల్‌లో విద్యార్థులు పరీక్ష రాస్తున్న తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్



గీతాంజలి స్కూల్ కేంద్రాన్ని సందర్శించిన ఎస్పీ జి.ఆర్.రాధిక



విద్యార్థులకు లోపలకు పంపిస్తున్న పోలీసులు



శ్రీకాకుళం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టెన్త్ క్లాస్ పరీక్షలు రాసేందుకు సిద్ధంగా ఉన్న విద్యార్థులు



ఆర్సీఎం లయోలా పాఠశాల కేంద్రంలో సిబ్బందికి సూచనలు చేస్తున్న ఏఎస్పీ ప్రేమ్‌కాజల్

మంత్రి ధర్మానకు కృతజ్ఞతలు



మంత్రి ధర్మానకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కామేశ్వరి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకురాలు తేజోమూర్తుల కామేశ్వరి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఇటీవల నియమితులయ్యారు. దీంతో రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావును తన క్యాంపు కార్యాలయంలో సోమవారం కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ పదవిని కట్టబెట్టినందుకు మంత్రి ధర్మాన, సీఎం జగన్, పార్టీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి వై.వి.సుబ్బారెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్‌కి కామేశ్వరి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి ధర్మాన మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషిచేయాలని సూచించారు. మంత్రిని కలిసిన వారిలో బ్రాహ్మణ సంఘ నాయకులు తేనేటి సునీల్ శర్మ, దూసి నాగేశ్వరరావు, రాజశేఖర్, గాయత్రి ప్రసాద్, ట్రేడ్ యూనియన్ నాయకులు భాస్కరరావు, నెడ్‌కాప్ కార్పొరేషన్ డైరెక్టర్ అలపాన త్రినాథరెడ్డి , సీజు, సంతోష్ ఉన్నారు.

20 నుంచి వల్లభనారాయణుని డోలోత్సవాలు



వల్లభనారాయణస్వామి



స్వామివారి ఆలయం

మందస: మండలంలోని ఉద్దాన గ్రామమైన రట్టిలో వల్లభనారాయణుని డోలోత్సవం నిర్వహణకు కమిటీసభ్యులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. యాత్ర ఐదు రోజులు జరుగుతున్నప్పటికీ.. మూడు రోజుల పాటు భక్తులు భారీగా తరలివస్తారు. ఏటా శివరాత్రి 12 రోజుల తరువాత స్వామి వారి డోలోత్సవాలను నిర్వహించడం పరిపాటి. అందులో భాగంగానే ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు స్వామి డోలోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. సింహాచలం పుణ్యక్షేత్రంలో వెలసిన సింహాద్రి అప్పన్న, రట్టిలో వెలసిన వల్లభనారాయణస్వామిని ఒక్కటిగా చెప్పుకునే భక్తులు ఉత్సవాల సందర్భంగా జిల్లాలోని మారుమూల ప్రాంతాల నుంచే కాక ఒడిశా రాష్ట్రం నుంచి కూడా భారీగా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుంటారు.

కార్యక్రమ వివరాలు..

డోలోత్సవాలు దేవదాయశాఖ ఆధ్వర్యంలో వివేకానంద యువజన సేవా సంఘం సహకారంతో నిర్వహిస్తారు. ఈ నెల 20న రాత్రి తొమ్మిది గంటలకు అంకురార్పణ చేస్తారు. 21న మఖా కామదహనం, 23న ప్రత్యేక పూజలు, స్వామివారి దర్శనాలు, 25న డోలోపూర్ణిమ, సముద్రస్నానం, కోలసేవ జరుగుతుంది.

పలాస డిపో నుంచి ప్రత్యేక బస్సులు

రట్టి వల్లభనారాయణస్వామి యాత్రకు పలాస ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేకంగా బస్సులు నడుపుతారు. మూడు రోజుల పాటు పలాస-హరిపురం-రట్టి, మందస-హరిపురం-రట్టి, సోంపేట-హరిపురం-రట్టిలను కలుపుతూ రట్టి యాత్ర స్పెషల్ పేరుతో బస్సులు తిరుగుతాయి.

ఓటు హక్కు వినియోగించుకోవాలి



లఘు నాటికను యూట్యూబ్‌లోకి అప్‌లోడ్ చేస్తున్న డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రజాస్వామ్యం బలోపేతం కావాలంటే ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం క్యాంపస్ డైరెక్టర్ కె.వెంకట గోపాల ధన బాలాజీ అన్నారు. ఎస్ఎంపురం ఆర్‌జీయూకేటీ క్యాంపస్‌లో సోమవారం విద్యార్థులు ఓటు హక్కు ప్రాధాన్యతపై రూపొందించిన లఘు నాటికను యూట్యూబ్ ప్రచార మాధ్యమంలో అప్‌లోడ్ చేశారు. ఈ సందర్భంగా ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ మాట్లాడుతూ ఓటు హక్కు ఉన్నవారు శత శాతం వినియోగించాలని, 18 ఏళ్లు దాటిన వారు ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 18 ఎన్నికల నోటిఫికేషన్ వరకు ఏపీలో ఓటు హక్కు నమోదుకు అవకాశం ఉంటుందన్నారు. ఓటు హక్కు వినియోగంపై యువత గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఓఎస్‌డీ ఎల్.సుధాకర్‌బాబు, ఏఓ మునిరామకృష్ణ, డీన్ కె.మోహన్‌కృష్ణ చౌదిరి పాల్గొన్నారు.

బలవంతపు రిటైర్మెంట్లు ఆపాలి



వరిసాంలో శ్యాంపిస్టన్స్ పరిశ్రమ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

రణస్థలం: శ్యాంక్రగ్ పిస్టన్స్ అండ్ రింగ్స్ పరిశ్రమలో బలవంతపు రిటైర్మెంట్ ఆపాలని సిఐటీయూ జిల్లా అధ్యక్షులు సీహెచ్ అమ్మన్నాయుడు డిమాండ్ చేశారు. మండలంలోని వరిసాం శ్యాంపిస్టన్స్ పరిశ్రమ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా అమ్మన్నాయుడు మాట్లాడుతూ వరిశాం గ్రామం వద్ద గల శ్యాంక్రగ్ పిస్టన్స్ అండ్ రింగ్స్ ప్లాంట్-2 పరిశ్రమలో ఉద్యోగ విరమణ వయస్సు రాకుండానే, ఎక్కడా లేనివిధంగా 30 ఏళ్ల సర్వీసు పూర్తయిందని కార్మికులతో యాజమాన్యం బలవంతపు రిటైర్మెంట్లు చేయించిందన్నారు. ఈ విధంగా ఇప్పటివరకు 50 మంది కార్మికులను రోడ్డున పడేశారని, పది నుంచి 12 ఏళ్ల సర్వీసు ఉన్నప్పటికీ కార్మికులను తొలగించడంతో ఆయా కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తొలగించిన కార్మికులందరినీ వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో శ్యాంక్రగ్ పిస్టన్ వర్కర్స్ అధ్యక్షుడు ఎం.అప్పలనర్సయ్య, ఎం.కూర్మారావు, జె.రాము, గొర్లె కృష్ణ, రామారావు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీల తొలగింపు



రణస్థలం: పైడిభీమవరంలో ఫ్లెక్సీ తొలగిస్తున్న అధికారులు

రణస్థలం: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లోనికి రావడంతో రణస్థలం మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ఫ్లెక్సీలు తొలగిస్తున్నారు. తహసీల్దార్ రామారావు, ఎంపీడీఓ ఆర్.వి.రమణమూర్తి ఆధ్వర్యంలో భారీ హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు, బ్యానర్లను అధికారులు తొలగించారు.

ప్రచార చిత్రాలపై ప్రత్యేక దృష్టి

ఎచ్చెర్ల క్యాంపస్: ఎన్నికల నియమావళి నేపథ్యంలో ప్రచార చిత్రాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. ప్రభుత్వ ప్రచార చిత్రాలు, పతిపక్ష ప్రచార చిత్రాలు తొలగిస్తున్నారు. లేదంటే కనిపించకుండా పేపర్లు అతికిస్తున్నారు. గ్రామ సచివాలయ సిబ్బందికి స్పష్టమైన అదేశాలు ఆధికారులు జారీ చేశారు. ఎన్నికల నిబంధనలు పక్కాగా అమలు చేయనున్నట్లు తహసీల్దార్ వి.శ్యాంకుమార్ తెలిపారు.

• అనుగ్రహించమ్మా..



విద్యార్థులు పదో తరగతి పరీక్షలు బాగా రాసేలా అనుగ్రహించమ్మా అంటూ కేజీబీవీ అధ్యాపకులు సోమవారం సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు చేశారు.

- జి.సిగడాం

దరఖాస్తుల ఆహ్వానం

జి.సిగడాం: స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయంలో 6వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుందని ప్రత్యేకాధికారి ఉషారత్నకుమారి సోమవారం తెలిపారు. 6వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం సీట్లు భర్తీ చేస్తామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఏప్రిల్ 11వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలు, నిబంధనల ప్రకారమే విద్యార్థులను ఎంపిక చేస్తామన్నారు.

సమన్వయంతో ఎన్నికల నిర్వహణ



సూచనలిస్తున్న ఎంపీడీఓ వెంకన్నబాబు

జి.సిగడాం: మండల స్థాయి అధికారులు, సచివాలయం సిబ్బంది సమన్వయంతో ఎన్నికల విధులు నిర్వహించాలని ఎంపీడీఓ వెంకన్నబాబు సూచించారు. మండలంలోని ఆనందపురం గ్రామ సచివాలయంలో పని చేస్తున్న వివిధ శాఖల సిబ్బందితో సోమవారం పోలింగ్ కేంద్రాలపై ఆరా తీశారు. ఎక్కడైనా రాజకీయ నాయకుల ఫొటోలు, బ్యానర్లు ఉంటే తక్షణమే తొలగించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి పైల జయరాం, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ప్రకృతి పంటలతో ఆరోగ్యం



ఎచ్చెర్లలో కూరగాయలు విక్రయిస్తున్న రైతులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని ఎస్ఎం పురంలో ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు ద్వారా కూరగాయలు సాగుచేసిన రైతులు ఎచ్చెర్ల మండల కాంప్లెక్స్‌లో సోమవారం విక్రయించారు. స్థానిక కార్యాలయాల ఉద్యోగులు కూరగాయలను కొనుగోలు చేశారు. రసాయన ఎరువులు, పురుగుల మందులు రహితంగా సాగు చేస్తున్నట్లు రైతులు మెట్ట ధనుంజయ, హరేరామ్ తెలిపారు. వినియోగదారులకు అనువైన ధరలకే కూరగాయలు విక్రయిస్తున్నట్లు చెప్పారు.

లోక్ అదాలత్ ద్వారా 155 కేసులు పరిష్కారం

టెక్కలి: టెక్కలి కోర్టు సముదాయంలో ఇటీవల నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ ద్వారా 155 కేసులు పరిష్కారమయ్యాయి. ఈవిషయాన్ని కోర్టు వర్గాలు సోమవారం ఓ ప్రకటన పేర్కొన్నాయి. ఇన్‌చార్జి సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు, ఇన్‌చార్జి జూనియర్ సివిల్ జడ్జి బి.ఎం.ఆర్.ప్రసన్నలత నేతృత్వంలో ఈ కేసులను పరిష్కరించినట్లు వెల్లడించారు. సివిల్ దావాలు ఐదు, క్రిమినల్ కేసులు 15, ఎస్ఈబీ కేసులు 20, ప్లీబార్గయినింగ్ ద్వారా రాజీ చేసినవి 111, చెక్ బౌన్స్ కేసు ఒకటి, మనోవర్తి ఒకటి, బ్యాంక్ పీఎల్‌సీలు రెండు.. తదితర కేసులను పరిష్కరించినట్లు పేర్కొన్నారు. ఈ కేసుల ద్వారా 12,43,330 రూపాయలు సెటిల్‌మెంట్ చేసినట్లు ప్రకటనలో వెల్లడించారు.

సేవాభావాన్ని అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న అనిల్‌కుమార్

మందస: విద్యార్థి దశ నుంచే సేవాభావాన్ని అలవర్చుకోవాలని మందస ఎస్ఐ బి.అనిల్‌కుమార్ అన్నారు. ఉద్దాన ప్రాంతమైన నారాయణపురం పంచాయతీలోని చిన్నకేశుపురం, బంజిరికేశుపురం గ్రామాల్లో ప్రత్యేక జాతీయ సేవా పథకం శిబిరాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యతో పాటు సేవాభావం కూడా కలిగి ఉండాలన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవోలు ఎన్.రామకుమార్, బి.శాంతారావు, ఏవో బి.శివ పాల్గొన్నారు.

గేట్ ర్యాంకర్‌కు సత్కారం



నీలాద్రిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఇచ్ఛాపురం రూరల్:

విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణను అలవర్చుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఆబోతు నీలాద్రి నిరూపించారని ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం సూర్యప్రభాకరరావు అన్నారు. గేట్-2024 పరీక్షలో ఆలిండియా స్థాయిలో 343వ ర్యాంకు సాధించిన నీలాద్రిని స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు సోమవారం సత్కరించారు.

స్ట్రాంగ్ రూముల్లో పకడ్బందీగా ఏర్పాట్లు

● 315 పోలింగ్ కేంద్రాల మెటీరియల్ భద్రపరిచేందుకు చర్యలు



స్ట్రాంగ్ రూమ్ వద్ద ఈవీఎంలు తనిఖీ చేసేందుకు ఏర్పాటు చేసిన రేండమైజేషన్ విభాగం



స్ట్రాంగ్ రూమ్‌లో మెటీరియల్‌ను భద్రపరిచేందుకు చేసిన ఏర్పాట్లు

టెక్కలి: ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో కేటాయించిన విధుల్లో అధికారులు బిజీగా ఉన్నారు. టెక్కలి నియోజకవర్గానికి సంబంధించి స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేటాయించిన స్ట్రాంగ్ రూమ్‌లో ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. నియోజకవర్గంలో 315 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి అవసరమైన మెటీరియల్‌ను భద్రపరిచేందుకు ఒక్కో గదిలో పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈవీఎంలు తనిఖీ చేసేందుకు రేండమైజేషన్ గదితో పాటు 315 పోలింగ్ కేంద్రాలతో పాటు అదనంగా మరో 75 ఈవీఎంలు వాటికి అవసరమైన మెటీరియల్‌ను భద్రపరిచేందుకు గదులను కేటాయించారు.